# అర్హులందరికీ ఆరు గ్యారెంటీలు

● ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

వలిగొండ, డిసెంబర్ 30 : అర్హులైన ప్రతి ఒక్కరికి ఆరు గ్యారెంటీలను అందిస్తామని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని వెంకటేశ్వర జడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో నిరుపేదల సంక్షేమానికి ప్రభుత్వం అందించబోతున్న ఆరు గ్యారంటీల దరఖాస్తులను ఆయన స్వీకరించి మాట్లాడారు. ఆరు గ్యారంటీల్లో మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.10లక్షల ఆరోగ్య శ్రీ పథకాలను ఇప్పటికే ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్డీఓ నాగిరెడ్డి, మండల ప్రత్యేక అధికారి శేఖర్‌రెడ్డి, ఎంపీపీ నూతి రమేశ్‌రాజ్, జడ్పీటీసీ వాకిటి పద్మాఅనంతరెడ్డి, వైస్ ఎంపీపీ బాతరాజు ఉమాబాలనర్సింహ, సర్పంచ్ బోళ్ల లలితాశ్రీనివాస్, ఎంపీడీఓ గీతారెడ్డి, తాసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



వలిగొండలో : మండల కేంద్రంలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

### కొనసాగుతున్న దరఖాస్తుల స్వీకరణ

భువనగిరి అర్బన్ : ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా వ్యాప్తంగా ఆరు గ్యారెంటీల దరఖాస్తుల స్వీకరణ కొనసాగింది. భువనగిరి మండలం అనాజిపురం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, తుక్కాపురంలో జరిగిన గ్రామ సభలో తాసీల్దార్ అంజిరెడ్డి, భువనగిరి పట్టణంలోని 17వ వార్డులో ఆర్డీఓ అమరేందర్, మున్సిపల్ చైర్మన్ ఎన్నబోయిన ఆంజనేయులు దరఖాస్తులను స్వీకరించారు. అలాగే భువనగిరి మండలంలో అనాజిపురంలో 651, తుక్కాపురంలో 525 దరఖాస్తులు స్వీకరించినట్లు ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, ఎంపీపీ నరాల నిర్మల, మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్ చెన్న స్వాతీమహేశ్ పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని రామలింగంపల్లి, గౌస్కొండ, అంతమ్మగూడెం, దోతిగూడెం, రేవనపల్లిలో దరఖాస్తులను స్వీకరించారు. మండల ప్రత్యేకాధికారి విద్యాసాగర్, తాసీల్దార్ వీరాబాయి, మున్సిపల్ కమిషనర్ కోమటిరెడ్డి నర్సింహారెడ్డి, సర్పంచులు ఫకీరు లావణ్య, రమావత్ నాయక్, వస్పరి పారిజాత, పగిళ్ల స్వప్న పాల్గొన్నారు.

చౌటుప్పల్ : చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం 7,8వార్డుల్లో ప్రజా పాలన కార్యక్రమం మూడో రోజు శనివారం కొనసాగింది. ఈ సందర్భంగా అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఇందుకోసం ప్రతి వార్డులో 4 ప్రత్యేక కౌంటర్లు, ఒక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ జగన్నాథరావు, ప్రత్యేకాధికారి పద్మజారాణి, మున్సిపల్ కమిషనర్ ఎస్.భాస్కర్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్లు కొయ్యడ సైదులుగౌడ్, కాసర్ల మంజుల పాల్గొన్నారు.

### ప్రజాపాలన దరఖాస్తులకు ఆధార్ నంబర్ చాలు

● అదనపు కలెక్టర్ వీరారెడ్డి

భువనగిరి అర్బన్, డిసెంబర్ 30 : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆరు గ్యారంటీలకు దరఖాస్తు చేసుకునేందుకు ఆధార్ నంబర్ సరిపోతుందని, ఎలాంటి ఆధార్ అప్‌డేట్, ఈకేవైసీ అవసరం లేదని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా ప్రజాపాలన దరఖాస్తులను జిరాక్స్ సెంటర్లలో, మీ సేవ కేంద్రాల్లో విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజాపాలన దరఖాస్తులు ప్రభుత్వమే సరఫరా చేస్తున్నదని, స్థానికంగా ఉండే పంచాయతీ కార్యదర్శి, మున్సిపల్ వార్డ్ ఆఫీసర్లు దగ్గర అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రజాపాలన దరఖాస్తులకు జత చేయడం కోసం ప్రజలు ఆధార్ అప్‌డేట్, ఈకేవైసీ కోసం మీసేవ సెంటర్లకు వెళ్తున్నారని, ప్రస్తుతానికి ఆధార్ నంబర్ చాలని ఆందోళనకు గురికావాల్సిన పనిలేదని పేర్కొన్నారు.


భువనగిరి అర్బన్ : 17వ వార్డులో దరఖాస్తులను స్వీకరిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆంజనేయులు


భూదాన్ పోచంపల్లి : గౌస్‌కొండలో దరఖాస్తులు స్వీకరిస్తున్న మండల ప్రత్యేకాధికారి విద్యాసాగర్, తాసీల్దార్ వీరాబాయ్

## రామన్నపేట నియోజకవర్గ ఏర్పాటుకు కృషి

● నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం


రామన్నపేటలో విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల వీరేశం

రామన్నపేట, డిసెంబర్ 30 : రామన్నపేటను నియోజకవర్గంగా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శనివారం మండలకేంద్రంలో విజయోత్సవ ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి కాల్వలను సంవత్సరంలోపు పూర్తి చేస్తానన్నారు. రామన్నపేట ప్రభుత్వ దవాఖానాను 100 పడకలుగా మారుస్తానని, చిట్యాల - భువనగిరి రోడ్డును నాలుగు లైన్లుగా మార్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన పాల్గొన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పున్న లక్ష్మీజగన్‌మోహన్, నార్మాక్స్ డైరెక్టర్ మందడి ప్రభాకర్‌రెడ్డి, సర్పంచులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

## సీఎంఆర్ సేకరణను వేగవంతం చేయాలి

● అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

భువనగిరి అర్బన్, డిసెంబర్ 30 : మిల్లర్ల నుంచి బాయిల్డ్, సీఎంఆర్ బియ్యం సేకరణను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ ఏ.భాస్కర్‌రావు అధికారులకు సూచించారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖామంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్‌రెడ్డి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ దేవేంద్రసింగ్ హాన్ శనివారం అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. సీఎంఆర్, బాయిల్డ్ బియ్యం సేకరణ, బియ్యం డెలివరీలో మిల్లర్లు ఎదురవుతున్న సమస్యలపై చర్చించారు. పౌర సరఫరాల యంత్రాంగం బాయిల్డ్ బియ్యం సేకరణపై దృష్టి సారించాలని, సీఎంఆర్ బియ్యం సేకరణను వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ గోపీకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

### అంతర్ కళాశాలల క్రీడా పోటీలు

చౌటుప్పల్, డిసెంబర్ 30 : చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని ముస్కు మధుసూధన్ రెడ్డి వ్యాయామ కళాశాలలో జనవరి 3నుంచి 8వ తేదీ వరకు ఎంజీయూ అంతర్ కళాశాలల క్రికెట్ పోటీలు ప్రారంభం కానున్నట్లు వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ సంజయ్‌కుమార్ సాహు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంజీయూ పరిధిలోని 20 కళాశాలలు ఈ పోటీలో పాల్గొంటాయని తెలిపారు. ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంజీయూ ఉప కులపతి గోపాల్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు.

### మున్సిపల్ చైర్మన్ పదవిపై అవిశ్వాస తీర్మాన తేదీని ప్రకటించాలి

● అదనపు కలెక్టర్‌కు కౌన్సిలర్ల వినతి


అదనపు కలెక్టర్ వీరారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కౌన్సిలర్లు

భువనగిరి అర్బన్, డిసెంబర్ 30 : భువనగిరి మున్సిపల్ చైర్మన్ పదవిపై అవిశ్వాస తీర్మానం తేదీని ప్రకటించాలని కోరుతూ 31 మంది కౌన్సిలర్లు శనివారం జిల్లా అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భువనగిరి మున్సిపాలిటీ పరిధిలో 35 మంది కౌన్సిలర్లు ఉండగా.. 15 మంది బీఆర్ఎస్ నుంచి, ఇద్దరు ఇండిపెండెంట్, ఒక్కరు బీజేపీ, ఇద్దరు కాంగ్రెస్ తరపున గెలుపొందినట్లు తెలిపారు. ఎన్నబోయిన ఆంజనేయులు, చింతల కిష్టయ్యకు మద్దతు తెల్పడంతో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లుగా నియమితులయ్యారన్నారు. కాగా ప్రస్తుతం మున్సిపల్ చైర్మన్ పదవిపై అవిశ్వాసం చేయాలని కోరుతూ 16 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు, 9 మంది కాంగ్రెస్ కౌన్సిలర్లు, 6 మంది బీజేపీ కౌన్సిలర్లు కోరారు.

### మహాయజ్ఞ కరపత్రం ఆవిష్కరణ

యాదగిరిగుట్ట, డిసెంబర్ 30 : శ్రీహనుమద్దీక్షా పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామిజీ ప్రత్యక్ష పర్యవేక్షణ, టీటీడీ సౌజన్యంతో తిరుపతిలోని ఎస్వీ విశ్వ విద్యాలయంలో జనవరి 21న కోటి హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్లు శ్రీరవికిశోర్ ధర్మసంస్థాపన చైర్మన్ వుడుతల నర్సింగ్‌రావు, నాగశాస్త్ర జ్యోతిష్య సిద్ధాంతి మెడికొండూరు పవన్‌స్వామి తెలిపారు. యాదగిరిగుట్ట ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ ప్రధానార్చకుడు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు కరపత్రం విడుదల చేశారు. లోక కల్యాణార్థం ఈ మహాయజ్ఞాన్ని చేపట్టామని భక్తులు ఆన్‌లైన్ dharmasamsthapana.in లో పేరు నమోదు చేసుకుని శ్రీహనుమాన్ కృప, వెంకటాచలపతి అనుగ్రహం పొందాలని కోరారు.


కరపత్రం ఆవిష్కరిస్తున్న ప్రధానార్చకుడు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు

### మోడల్ స్కూల్‌లో స్వపరిపాలన దినోత్సవం

చౌటుప్పల్, డిసెంబర్ 30 : పట్టణ కేంద్రంలోని సిటీ మోడల్ స్కూల్‌లో స్వపరిపాలన దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయుల వేషధారణలో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గోదాదేవి, చైర్మన్ రామనుజాచార్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులతో విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

### మాల్కంబ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ

చౌటుప్పల్, డిసెంబర్ 30 : నాగర్‌కర్నూల్ జిల్లా చారగొండలో ఈ నెల 29న 67వ రాష్ట్ర స్థాయి మాల్కంబ్ పోటీలు నిర్వహించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్14, 17బాలుర, బాలికల విభాగాల్లో ఈ పోటీలు నిర్వహించారు. పోటీల్లో చౌటుప్పల్ పట్టణానికి చెందిన ట్రినిటి పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో కె.అక్షిత, కె.చిత్రాక్షి, ఎం.లోహిత, ఎం.సహస్ర, ఎస్.హేమంత్, ఎస్.శ్రీహర్ష ఉన్నారు. జనవరి 7నుంచి 12తేదీల్లో ఉజ్జయినిలో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారు. వీరిని పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కేవీబీ కృష్ణారావు, ప్రిన్సిపాల్ మంజుల శనివారం అభినందించారు.